మూడో దారి కోసం..
మూడు బస్తీల దారి మూసివేత

- రెండేళ్లయినా పూర్తి కాని పనులు..
- కనుచూపు మేరలో ఉన్న చాదర్‌ఘాట్‌కు వెళ్లాలంటే కిలో మీటర్ తిరిగి రావాల్సిందే..

మలక్‌పేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మరో వెంట్ (దారి) నిర్మాణం కోసం పక్కనే ఉన్న మూడు బస్తీల దారులను మూసివేశారు. దాదాపు రెండేళ్లుగా వినాయకవీధి, మూసానగర్, రసూల్‌పుర బస్తీవాసులు కనుచూపు మేరలో ఉన్న చాదర్‌ఘాట్‌కు వాహనంపై వెళ్లాలంటే కిలోమీటర్ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట వైపు వెళ్లాలంటే మలక్‌పేట ఆర్‌యూబీ నుంచి వెళ్లే వాహనాదారులు నిత్యం ట్రాఫిక్‌లో ముందుకు సాగాల్సి వస్తోంది.

చాదర్‌ఘాట్. ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మెయిన్ రోడ్డుపై వెళ్లే వాహనాదారుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చేపట్టిన మూడోదారి నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకాలతో పక్కనే ఉన్న వినాయక వీధి, మూసానగర్, రసూల్‌పుర బస్తీల దారులను తాత్కాలికంగా మూసివేశారు. మలక్‌పేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మరో వెంట్ నిర్మాణానికి ముందు మూసానగర్ బస్తీవాసులు వినాయకవీధి నుంచి రాకపోకలు సాగించే వారు. ఇప్పుడు వినాయకవీధి రోడ్డు తాత్కాలికంగా మూత పడిన కారణంగా మూసానగర్, రసూల్‌పుర వైపు ఉన్న చాదర్‌ఘాట్ కాజ్‌వే బ్రిడ్జి ప్రధాన రోడ్డు వన్ వే కావడంతో ఇక్కడి బస్తీవాసులు ప్రతీసారి చాదర్‌ఘాట్ బ్రిడ్జి నుంచి చాదర్‌ఘాట్ కాజ్ వే బ్రిడ్జి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ఇదే సమస్యను చాదర్‌ఘాట్ కాజ్‌వే బ్రిడ్జికి సమీపంలో ఉన్న మూసానగర్ బస్తీవాసులు కూడా ఎదుర్కొంటున్నారు. ఇక్కడి వాహనాలు వినాయక వీధి బస్తీ నుంచి వెళ్లేందుకు వీలులేని కారణంగా మూసానగర్ బస్తీలో నుంచే వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద పూర్తయిన మరో దారి



మూసివేసిన వినాయకవీధి రోడ్డు

మెట్రో కోసం మూడేళ్లు..

మూడో దారి కోసం రెండేళ్లుగా...

మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల కారణంగా 2014, 2015, 2016లో మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద ప్రధాన రహదారిపై తవ్వకాలు చేపట్టారు. ఈ తవ్వకాల మట్టిని వినాయక వీధి రోడ్డుపై వేయడంతో అప్పట్లో తాత్కాలికంగా రోడ్డు మూత పడింది. అప్పట్లో కనీసం నడుచుకుంటూ వెళ్లేందుకైనా అనుమతించారు. తాజాగా 2022 నుంచి చేపట్టిన మలక్‌పేట ఆర్‌యూబీ మూడో దారి నిర్మాణం కోసం మరోసారి వినాయక వీధి రోడ్డును తాత్కాలికంగా మూసివేశారు. ఈసారి కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలు లేని విధంగా రోడ్డును ఇనుప రేకులతో మూసివేశారు. ఆర్‌యూబీ మూడో దారి నిర్మాణం పూర్తయినా రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో వినాయకవీధిలో తాత్కాలికంగా మూత పడిన దారి తెరచుకోడానికి వీలులేకుండా పోయింది.

ఎమ్మెల్యే ముందు

గోడు వెళ్లబోసుకున్న బస్తీవాసులు..

మలక్‌పేట ఆర్‌యూబీ మూడో దారి నిర్మాణం కోసం మూతపడిన వినాయక వీధి రోడ్డును ఎప్పుడు తెరుస్తారని వినాయకవీధి, మూసానగర్, రసూల్‌పుర బస్తీవాసులు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు ఆర్‌యూబీ మూడో దారి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. వీలైనంత త్వరగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

బారికేడ్లను తొలగించాలి

ఆర్‌యూబీ మూడోదారి నిర్మాణం తవ్విన రోడ్డు పనులు పూర్తయ్యే వరకు వినాయక వీధి, మూసానగర్, రసూల్‌పుర బస్తీవాసులు చాదర్‌ఘాట్ వైపుకు వెళ్లేందుకు మలక్‌పేట పోస్టాఫీసు ముందు రోడ్డు మద్యలో ఉన్న డివైడర్‌ను తాత్కాలికంగా తొలగించి వాహనాలు వెళ్లేందుకు అనుమతించాలని ట్రాఫిక్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఇక్కడ నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటున్న కారణంగా రోడ్డు క్రాస్ చేసేందుకు వీలులేకపోవడంతో డివైడర్ మూసివేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కనీసం తాత్కాలికంగా డివైడర్‌లను తొలగించాలని చాదర్‌ఘాట్ వైపు వెళ్లేందుకు అనుమతిస్తే కనీసం మూడు కిలోమీటర్లు తిరిగి వచ్చే బాధ తప్పుతుందని బస్తీవాసులు విన్నవిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గజ్జల కాంతం

ఉద్యమకారులను గుర్తించాలి : వక్తలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కేసుల నమోదుతో సంబంధం లేకుండా తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ప్రయోజనాలు కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. దివ్యాంగులు, మహిళలు ఉద్యమంలో పాల్గొన్నా.. కేసులు నమోదు కాలేదని, కొందరు మారు పేర్లు చెప్పడంతో అసలు పేర్లపై కేసులు నమోదైన వివరాలు లేవన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని అసలైన ఉద్యమకారులకు తగిన గుర్తింపునివ్వాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధనకు కమిటీ వేసి పార్టీలకతీతంగా పోరాడాలన్నారు. ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం మాట్లాడుతూ తెలంగాణ ద్రోహులకు పదవులు కట్టబెట్టిన మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమ ద్రోహి అయ్యారన్నారు. కేసీఆర్ జన్మలో మళ్లీ అధికారంలోకి రాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని పిడమర్తి రవి అన్నారు. 250 గజాల భూమి, రూ.25 వేల పెన్షన్ ప్రకటనపై సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలుపుతూ.. ఇది ఉద్యమకారులకు దక్కిన తొలి గుర్తింపు అన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

కాళ్లు పట్టుకునే అవసరం మాదిగ జాతికి లేదు

- **టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్**

రాంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎవరి కాళ్లు పట్టుకునే అవసరం మాదిగజాతికి లేదని, మాదిగల హక్కుల కోసం ఎంతకైనా పోరాటం చేస్తామని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణమాదిగ జాతిని ఆత్మగౌరవం నుంచి బానిసత్వం వైపు నడపాలని అనుకుంటున్నారని ఆరోపించారు. మందకృష్ణమాదిగను నడిపిస్తున్న మనువాద బీజేపీకి తెలంగాణలో ఆస్కారమే లేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ జాతి బీజేపీకి ఓటు ద్వారా బుద్ధిచెబుతుందని ఆయన హెచ్చరించారు.

జేఎన్‌టీయూలో అఫిలియేషన్ దందా..!

- **ఇంజనీరింగ్ కళాశాలల గుర్తింపు దరఖాస్తుకు నేటితో ఆఖరు**

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అధికారులు ఈ ఏడాది త్వరగా అఫిలియేషన్ తీసుకోవాలంటూ తమను ఎందుకు తొందర పెడుతున్నారో అర్థం కావడం లేదని ప్రైవేటు కళాశాలల యాజమాన్య ప్రతినిధులు వాపోతున్నారు. ఎన్‌వోసీలకు ఇచ్చిన గడువును 10 రోజుల ముందుకు ప్రీపోన్‌మెంట్ చేయడం, ఆదివారంలోగా అఫిలియేషన్‌కు దరఖాస్తు చేసుకోకుంటే భారీగా జరిమానా విధిస్తామనడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పైఅధికారులను సంతృప్తిపరచడం కోసమని అఫిలియేషన్ దందాలకు తెరతీయడం సమంజసంగా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యమైతే 100 శాతం ఫీజును జరిమానా అదనంగా చెల్లించాలంటూ.. ఈ నెల 12న యూనివర్సిటీ రిజిస్ట్రార్ పేరిట విడుదల చేయడం దారుణమని పేర్కొన్నారు. జరిమానాల పేరిట ప్రైవేట్ కళాశాలలపై జేఎన్‌టీయూ భారం మోపితే.. ఆ భారం అటూ ఇటూ తిరిగి ఆయా కాలేజీల్లో చేరే విద్యార్థులపైనే పడుతుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. కాగా, అఫిలియేషన్ ప్రక్రియ ఆలస్యం కాకూడదనే ఈ ఏడాది త్వరగా ప్రారంభించామని వీసీ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి తెలిపారు.

27 నుంచే ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలు..

ఈ నెల 27 నుంచే ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో నిజనిర్ధారణ చేస్తామని, మార్చి 20లోగా ఆ ప్రక్రియ పూర్తి చేస్తామని రిజిస్ట్రార్ జారీ చేసిన సర్క్యులర్‌లో ప్రస్తావించారు. వాస్తవానికి గతేడాది ప్రైవేట్ కళాశాలల్లో ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలను ఏప్రిల్ 20 నుంచి నిర్వహించారు. ఈ ఏడాది రెండు నెలలు ముందుగా చేపట్టడానికి కారణాలేమై ఉంటాయా అని పలువురు చర్చించుకుంటున్నారు.

కైతలాపూర్ గ్రౌండ్‌లో డ్రోన్ విన్యాసాలు



డ్రోన్ షోలో సీఎంఆర్ సంస్థ సభ్యులు, మోడళ్లు



డ్రోన్ షోలోని దృశ్యం

అల్లాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ ఫ్యామిలీ మాల్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి కైతలాపూర్ గ్రౌండ్‌లో మెగా డ్రోన్ షోను శనివారం నిర్వహించారు. ఈ షోలో సీఎంఆర్ సంస్థకు సంబంధించిన విశేషాలను, తాము అందిస్తున్న విభిన్న రకాల ఉత్పత్తులు, ప్రత్యేకతలను వివరించారు. నగధగలు.. మోడల్స్ హోయలు మరోవైపు సీఎంఆర్ లెగసీ ఆఫ్ జ్యుయలరీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లామ్ వాక్ కూడా కళ్లు జిగేల్ మనిపించింది. బిగ్‌బాస్ ఫేం జెస్సీ సారథ్యంలో జరిగిన ఈ ర్యాంప్ వాక్‌లో అందమైన మోడల్స్ ఆభరణాలను మేనిపై మెరిపిస్తూ జ్యుయలరీ ప్రియులను ఆకట్టుకున్నారు. ఎండీ సత్యనారాయణ మాట్లాడుతూ నగరవాసులకు వైవిధ్య భరిత అనుభూతి అందించాలని డ్రోన్ షో నిర్వహించామన్నారు.

అశ్లీల ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్

- **సైబర్ నేరగాడి అరెస్ట్**

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో బాలికలను ట్రాప్‌చేసి అశ్లీల ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్న సైబర్ నేరగాడి ఆటకట్టించారు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు. జాయింట్ సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెంకు చెందిన నిందితుడు ఆర్టిస్ట్ - విజయ్ - కుమార్ - 11005 పేరుతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా సృష్టించాడు. పార్ట్‌టైం జాబ్స్ ఫర్ గర్ల్స్ పేరుతో స్టేటస్‌లు పెట్టేవాడు. అతన్ని సంప్రదించినవారికి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపి, ఫ్రెండ్స్‌గా మార్చుకొని రోజూ చాటింగ్ చేసేవాడు. తన మాయమాటలతో న్యూడ్ ఫొటోలు, న్యూడ్ వీడియోలు తీసుకునేవాడు. ఆ తర్వాత వాటిని అడ్డం పెట్టుకొని బ్లాక్‌మెయిల్ చేసేవాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు బృందం రంగంలోకి దిగి టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి సైబర్ నేరగాడిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

వండర్స్ ఆఫ్ ద వైల్డ్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ పోటీ

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ ప్రియుల కోసం నికాన్ ఇండియా సంస్థ తొలిసారిగా వండర్స్ ఆఫ్ వైల్డ్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ పోటీని వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్- ఇండియాతో కలిసి నిర్వహిస్తోంది. మార్చి 3 వరకు జరుగుతుంది. విజేతలకు నికాన్ జెడ్ సిరీస్ కెమెరాలు బహుమతిగా అందజేస్తారు. టాప్ 10లో నిలిచిన వారికి డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా నేచర్ స్టోర్ మర్చండైజ్‌ను అందించనున్నారు. ఆసక్తి గల వారు నికాన్ ఇండియా వెబ్‌సైట్ (https://capturewithnikon.in/wondersofthewild)లో, ఇన్‌స్టాగ్రామ్ @NikonIndiaOfficialలో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చు.

నేడు సనత్‌నగర్‌లో అగ్నిమాపకశాఖ
ప్రధాన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లో క్రెడాయ్ సహకారంతో రూ. 17 కోట్లతో నిర్మితమైన అగ్నిమాపక శాఖ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం వర్చువల్‌గా ప్రారంభిస్తారని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. 29,653 చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల్లో అత్యాధునిక హంగులతో భవనాన్ని నిర్మించారు. సెల్లార్‌లో పార్కింగ్, గ్రౌండ్, మొదటి అంతస్తులో అగ్నిమాపక కేంద్రాలు, రెండో అంతస్తులో కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రాంతీయ అగ్నిమాపక అధికారి కార్యాలయం, డీజీ, అడిషనల్ డైరెక్టర్స్ కార్యాలయం, నాలుగో అంతస్తులో డైరెక్టర్ జనరల్, బోర్డు రూమ్ ఏర్పాటు చేశారు.

త్రోబాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నవీన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ త్రోబాల్ సంఘం నూతన అధ్యక్షుడిగా వి.నవీన్ యాదవ్ ఎన్నికయ్యారు. శనివారం యూసుఫ్‌గూడలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవీన్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్, కోశాధికారిగా వెంకట్ బాధ్యతలు స్వీకరించారు. శాట్స్ నుంచి అలెగ్జాండర్ ఫ్రాన్సిస్, జాతీయ త్రోబాల్ సంఘం నుంచి మధు ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



సరూర్‌నగర్‌లో నిర్వహించిన కేసీఆర్ జన్మదిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ అనితాదయాకర్‌రెడ్డి



వినయ్‌నగర్‌లోని జీఎస్ఆర్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి,



సైదాబాద్ మాదన్నగుల్ల వద్ద అంగన్‌వాడీ కేంద్రంలో వేడుకలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ స్వర్ణలతారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి

కాంట్రాక్టు ఉద్యోగులకు
తక్షణమే జీతాలను చెల్లించాలి

వనస్థలిపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్ర జ్యోతి): వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు తక్షణమే జీతాలను చెల్లించాలనీ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ.. వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు రాకపోవంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో జీతాలు అందేవిధంగా తన వంతుగా కృషి చేయాలిని కోరుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఉద్యోగులు వినతి పత్రం అందజేసి నిరసన కార్యక్రమాన్ని విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సంతోష్, గోవర్దన్, భాగ్యమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కర్మన్‌ఘాట్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీ వేంకటేశ్వర ఆస్పత్రి ఎండీ రాముని వేణుగోపాల్

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

చంపాపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీ వేంకటేశ్వర ఆస్పత్రి ఎండీ డాక్టర్ రాముని వేణుగోపాల్ హాజరై అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ధర్మకర్త, ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు బి.కిరణ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అనంతుల రవిశెట్టి, ఆకుల సంతోష్‌కుమార్, రమాకాంత్‌గుప్తా, మంచుకొండ రామ్మూర్తి, పద్మజా, పద్మనారాయణ, సతీష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీయాలి

చంపాపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని ఉపాధ్యాయులు వెలికి తీయాలని కార్పొరేటర్ సుజాతనాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ అనుపమనగర్ కాలనీలోని 'వేద ది స్కూల్‌లో శనివారం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫేయిర్‌కు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ హాజరై ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచే శాస్త్ర సాంకేతిక రంగాల వైపు దృష్టి సారించాలని కోరారు. విద్యార్థులు 50 రకాల ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సంకల్పు శుక్లా, ప్రిన్సిపాల్ దీపా, సురేష్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మాక్‌పోల్

- **స్కూల్ లీడర్ ఎన్నిక**

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోల్ ద్వారా స్కూల్ లీడర్‌ను ఎన్నుకున్నారు. స్కూల్ హెచ్‌ఎం ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల్లో విద్యార్థులు అఖిలేశ్వర్, లహరి, రమ్యశ్రీ, సునీల్ హెంబ్రాన్ పోటీ చేశారు. సునీల్ హెంబ్రాన్ అత్యధిక మెజార్టీతో గెలుపొంది స్కూల్ లీడర్‌గా ఎన్నికయ్యారు. సెకండ్ లీడర్‌గా లహరి ఎన్నికైంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీటీసీ చేగూరి వెంకటేష్, ఉపాధ్యాయులు సరస్వతి, మంజుల, రామలింగంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సిరిపురం యాదయ్యకు ఘన నివాళి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన సిరిపురం యాదయ్యకు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. కొత్తపేట చౌరస్తాలోని యాదయ్య విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితాదయాకర్‌రెడ్డి, చైతన్య భారతి ఫౌండేషన్ చైర్మన్ ఆరుట్ల సురేష్‌కుమార్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్, కాంగ్రెస్ నాయకుడు ఆకుల అరవింద్‌కుమార్, చామకూర రాజు, రాఘవేంద్రగుప్తా, సిలివేరు వెంకట్‌గౌడ్, సిద్దూ ముదిరాజ్, కిరణ్‌రాజ్, సురేష్, సుదర్శన్‌ముదిరాజ్ తదితరులు యాదయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈటలపై దుష్ప్రచారం తగదు: కార్పొరేటర్ కొప్పుల

మన్సూరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తన నూతన గృహప్రవేశానికి వచ్చిన మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్‌ను రాజకీయంగా బద్నాంచేయటం సిగ్గుచేటని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 14న మన్సూరాబాద్‌లో జరిగిన తన నూతన గృహప్రవేశానికి రాజకీయలకతీతంగా పలువురు రాజకీయ నాయకులు హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా ఆ నాయకులంతా కలిసి ఒకే టేబుల్‌పై భోజనం చేసిన ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టి దుష్ప్రచారం చేయటం తగదన్నారు. దురుద్దేశ్యంతో ఈటల రాజేందర్ ఫోటోలు వైరల్ చేస్తూ ఆయన పార్టీ మారుతున్నాడని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

గుడిసెవాసులకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలి

సైదాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): యాకత్‌పురా నియోజకవర్గం పరిధిలోని గుడిసెవాసులకు అదే స్థలంలో ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని కోరుతూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో సైదాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయం ముందు గుడిసెవాసులు ధర్నా నిర్వహించారు. సీపీఐ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఛాయాదేవి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సిద్ధ సమాధి యోగ తరగతులు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని భవాని మహిళా మండలిలో ఆదివారం నుంచి సిద్ధ సమాధి యోగ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఎస్ఎస్‌వై శిక్షకుడు ఆర్. సద్గుణాచారి తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ తరగతులుంటాయన్నారు. సిద్ధ సమాధి యోగతో అధిక రక్తపోటు, మధుమేహం, అస్తమా, అల్సర్స్, మానసిక ఆందోళనలు, ఊబకాయం, పక్షవాతం, దురాలవాట్ల నుంచి విముక్తి లభిస్తుందని ఆయన చెప్పారు. ఇతర వివరాలకు 9393357033లో సంప్రదించాలని సూచించారు.



రోడ్డు మీద పడిన నీరు



నీరు లీకేజీవుతున్న స్లాబ్

మెట్రోస్టేషన్ స్లాబ్ నుంచి నీటి లీకేజీ

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ వంతెన నుంచి నీరు లీకై ఆ రహదారి గుండా వెళ్తున్న వాహనదారుల మీద పడుతుండడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసారాంబాగ్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే రహదారిలో దిల్‌సుఖ్‌నగర్ మెట్రోస్టేషన్ వద్ద పిల్లర్ నెం.1535 నుంచి 1537 వరకు స్టేషన్ స్లాబ్ మీద నుంచి కిందకు నీరు కారుతోంది. అయితే మధ్యాహ్నం వరకు నీటి లీకేజీని నివారించారు.

డీసీసీ ప్రధాన
కార్యదర్శిగా వక్కలంక



శ్రీనివాస్‌రావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వక్కలంక శ్రీనివాస్‌రావు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. శనివారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి వక్కలంకకు నియామక పత్రాన్ని అందజేశారు. వక్కలంక శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం కాంగ్రెస్ నాయకుడు శశి పాల్గొన్నారు.





హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో యూజెనిక్స్ హెయిర్ సైన్స్ కొత్త శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న క్రికెటర్ మహ్మద్ షమీ, మాజీ క్రికెటర్ అజారుద్దీన్, పింకిరెడ్డి, హాలీవుడ్ నటి అలెగ్జాండ్రియా టైలర్

రంగారెడ్డి జిల్లా కోర్టును సందర్శించిన పోర్ట్‌ఫోలియో జడ్జి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టు పోర్ట్‌ఫోలియో జడ్జి అభినందకుమార్ శావిలి శనివారం జిల్లా కోర్టును సందర్శించి జిల్లాన్యాయమూర్తులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో రంగారెడ్డిజిల్లా ప్రధానన్యాయమూర్తి శశిధర్‌రెడ్డి, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభిరామారావు, ఇతర న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.



కలెక్టర్ శశాంక్‌ను కలిసిన మజీద్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

పదో తరగతి పరీక్షల సెంటర్లను
స్థానికంగా ఏర్పాటు చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్‌ను శనివారం మజీద్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి జ్ఞాపికను అందజేశారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడి పండుగ కార్యక్రమం గురించి వివరించారు. మజీద్‌పూర్, అనాజ్‌పూర్, గుంతపల్లి ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి పరీక్షల సెంటర్లను స్థానికంగానే ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు మాజీ సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రవీంద్ర, మాజీ వార్డు సభ్యులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం ఎదురు చూస్తున్న మహిళకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి రూ.లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీని అందజేశారు. నాగోల్ డివిజన్ సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న రహనా సుల్తానా కొన్ని రోజులుగా కడుపునొప్పి సమస్యతో బాధపడుతోంది. ఆస్పత్రికి వెళ్లగా శస్త్రచికిత్స చేయాలని డాక్టర్లు సూచించారు. ఆమె కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం వారి కుటుంబసభ్యులకు ఎస్ఓసీ లెటర్‌ను అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, మధుసాగర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో జంట ఆత్మహత్య

శ్రీశైలం, ఫిబ్రవరి 17: శ్రీశైలం దేవస్థానం వసతి గృహం గౌరీ సదన్‌లో ఓ జంట ఆత్మహత్య చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన మల్లేష్(32), సరిత(28) ఈ నెల 13వ తేదీ ఉదయం గౌరీ సదన్‌లో 137 నంబరు గది తీసుకున్నారు. నాలుగు రోజుల నుంచి గది రెన్యువల్ చేయలేదు. దుర్వాసన వస్తోందని పక్కగదిలో ఉన్న యాత్రికులు దేవస్థానం సిబ్బందికి తెలియజేయగా వారు, పోలీసులకు సమాచారం అందించారు. శ్రీశైలం వన్ టౌన్ సీఐ ప్రసాదరావు ఘటనాస్థలానికి చేరుకుని గది తలుపులు తెరిపించి.. ఇద్దరూ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. కాగా.. సరూర్‌నగర్‌కు చెందిన మల్లేష్, సరిత వివాహితులు. వారి మధ్య కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. కుటుంబ సభ్యులు మందలించడంతో ఈ నెల 13న శ్రీశైలానికి వచ్చి ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

మేనత్తను హత్యచేసిన మేనల్లుడు

- **తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి**
- **పోలీసుల అదుపులో నిందితుడు**



లక్ష్మమ్మ (ఫైల్)

వనస్థలిపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్ర జ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మేనత్తను మేనల్లుడు సిమెంట్ ఇటుకతో తలపై బలంగా కొట్టి హత్యచేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన ఎరుకల లక్ష్మమ్మ(53) భర్త సత్తయ్య, ఇద్దరు కొడుకులు రాజు, కిరణ్ కుమారులతో కలిసి నగరంలోని ఇంజాపూర్‌లో నివాసముంటున్నారు. లక్ష్మమ్మ భర్త సత్తయ్య వాచ్‌మన్‌గా, లక్ష్మమ్మ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. లక్ష్మమ్మ సొంత అన్న కొడుకు మాదగోని రాజు(29) కారు డ్రైవింగ్ చేసుకుంటూ కమ్మగూడలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. లక్ష్మమ్మ వద్ద రాజు కొన్ని నెలల క్రితం కొంత డబ్బును మిత్తికి తీసుకున్నాడు. అసలు చెల్లించగా మిత్తి ఇవ్వలేదు. దీంతో లక్ష్మమ్మ రాజును పలుమార్లు మిత్తి డబ్బులు ఇవ్వాలని అడుగుతూ వస్తోంది. అందులో భాగంగా శనివారం సాయంత్రం రాజు తన మేనత్త లక్ష్మమ్మ ఇంటికి రావడంతో లక్ష్మమ్మ తనకు రావాల్సిన మిత్తి డబ్బులు ఇవ్వాలని నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. క్షణికావేశంలో రాజు పక్కనే ఉన్న సిమెంట్ ఇటుకతో లక్ష్మమ్మ తలపై పలుమార్లు బలంగా కొట్టాడు. దీంతో ఆమె తలపగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. నిందితుడు పోలీసులకు లొంగిపోయాడు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.